# ఓడలూ - బళ్లూ

(కథానిక)

ఆఖరు పరీక్ష పేపరు రాసేసి వాచరు మొహాన వేసి సగం ప్రాణంపోగా, కొనవూపిరితో, కాలేజీ ప్రక్కనే పెట్టిన క్రొత్త హోటల్లో దూరాడు నారాయణ. ఆ హోటల్లో కాలు పెట్టడం అదే మొదటిసారి. లోన అడుగు పెడ్తూ క్రొత్తహోటల్ని ఒక్కసారి అవలోకించే సరికి ప్రక్కకౌంటరుదగ్గర కూర్చున్న హోటలు యజమాని కంటబడ్డాడు. నారాయణ ఆ వ్యక్తి వంక చూచాడు. సందేహం లేదు. అతను చక్రపాణే! నారాయణ వూరికి కరణంగిరీ చేసిన చక్రపాణి. నారాయణ కొంచెంసేపు ఘ్రాన్పడిపోయాడు. తరువాత మెల్లగా వెళ్ళి చక్రపాణికి నమస్కరించేడు. చక్రపాణి తలెత్తి మసక జోడు లోనుంచి పరీక్షగా చూచి "ఎవరండీ మీరు?" అన్నాడు.

నారాయణ చిన్నగా మందహాసం చేసి "నేనా అండి, కలపటపువారబ్బాయిని. నరసింహారావు గారు మా నాన్నగారే" అన్నాడు.

"ఓహో! నువ్వటోయి ఏంచేస్తున్నావిక్కడ?" అన్నాడు చక్రపాణి.

"నేనిక్కడేనండి చదివేది" అన్నాడు నారాయణ సమాధానంగా.

చక్రపాణి ఏదో స్మృతికివచ్చినట్లు "అవును. చదువుతున్నావుకు - బాగా చదువుతున్నావా నారాయణా?" అన్నాడు.

నారాయణ నమ్రతగా "ఆఁ! బాగానేచదువుతున్నానండి" అన్నాడు.

తరువాత చక్రపాణి ఏవేవో కుశలప్రశ్నలు వేశాడు. సర్వరుచేత కాఫీ తెప్పించి నారాయణకిచ్చి అతని కుటుంబవిషయాలు పరామర్శచేశాడు. నారాయణ చక్రపాణి అడుగుతున్న ప్రశ్నలకి సమాధానం చెబుతున్నాడేగాని అతని మనసంతా "చక్రపాణిగారు ఈ స్థితికి రావడానికి కారణమేమిటి?" అన్న ప్రశ్ననుగురించే ఆలోచిస్తోంది. ఈ ప్రశ్న వెయ్యడానికి తగినంత అవకాశం ఇవ్వలేదు చక్రపాణి. నారాయణ కాఫీకప్పు ఖాళీచేసి బల్లమీద పెట్టగానే "ఆఁ! ఇక వెళ్లోస్తావా నాయనా, వస్తూవుంటూవుగా. అప్పుడప్పుడు కనిపించిపో బాబూ!" అన్నాడు చక్రపాణి.

ఎంతో బలవంతంమీదగాని నారాయణ దగ్గరినుంచి కాఫీకి డబ్బులు తీసుకోలేదు.

"హోటలు బాగా సాగుతోందాండి?"

"ఏమిసాగటంలే. ఏదో ఒక్కప్రాణానికి ఎంతకావాలి?"

"ఎన్నిగంటలవరకూ తీసివుంటుంది?"

"కాలేజీ వదిలింతరువాత ఇటువేపు ఎవరు తిరుగుతారు నాయనా! ఎనిమిది గంటలు దాటితే ఇటు అసలు మనుషులు నడువరు. అప్పటికి కట్టేసిపోతాను. నువ్వువస్తే ఒక్కసారి ఎనిమిది గంటలలోపేరా." అన్నాడు.

నారాయణ వుండబట్టలేక "దీంట్లోవచ్చే సంపాదన సంసారానికంతకూ సరిపోతుందాండి?" అన్నాడు.

చక్రపాణి కొద్దిగానవ్వి "జానెడు పొట్టకు ఎంతకావాలి?" అన్నాడు.

చక్రపాణి మాట్లాడే ప్రతిమాటలోనూ నారాయణకు నిరాశ గోచరించింది. ఆయన చిరునవ్వులో గాఢతిమిరపరివ్యాప్తమైన భావం గోచరిస్తోంది. ఆయన పుట్టిన పుట్టుకను అంత నిరాశ జీవితంలో పొందవలసిన ఆగత్యంలేదు.

"సాయంత్రం ఒకసారి వస్తానండి."

"అలాగే రావోయ్! యెనిమిదిన్నర - ఆ ప్రాంతాల్లోవస్తేఇంకేమీ పనివుండదు" అన్నాడు చక్రపాణి.

నారాయణ బయలుదేరాడు. ఆ రోజుతో పరీక్షలకోసం జ్ఞాపకముంచుకున్న తుక్కంతా విడిచేసినా బుర్రలోంచి, ఆలోచనకు అప్పుడే అలవాటుపడ్డ మెదడు కరణం చక్రపాణినిగురించే

"తిరునగర్"

ఆలోచించడం మొదలుపెట్టింది. నారాయణ మెల్లగా నడుస్తున్నాడు. చక్రపాణి వాళ్ళఊళ్లో తను వీధిబడిలో చదువుకునే రోజుల్లోవుండే వైభవమంతా అతని కళ్ళముందు కన్పించసాగింది.

ఊళ్ళోకి జట్కాబండి మొదలు, చిన్నకారు వరకూ ఏవన్నా వచ్చాయంటేకరణంగారికి సంబంధించిన వాళ్ళెవరైనాగానీ, లేదా స్వయంగా కరణంగారేగాని అయివుంటుందన్నమాటే. అసలు కరణంగారు రావడానికి గుర్తే కారు హారన్. మైలు దూరాన వుండగానే కారు హారన్ విని, కరణంగారు వస్తున్నారని చిన్నకారుకోసం తను పిల్లలతో ఎన్నోసార్లు గంతులువేసి కేకలు వేసేవాడు. వూళ్ళో ఎవరైనా పట్నానికి వెళ్ళలేక బండీ ఏదైనా కావాలంటే "కరణంగారు వొస్తారుండరా. కార్లో వెళ్ళచ్చు!" అనేవారుకూడా.

చక్రపాణి జల్సా పురుషుడుగానే వుండేవాడు. ఉన్నతభావాలుగల వ్యక్తి. తండ్రి సంపాదించిపోయిన ఆస్థి వుంది పాతిక ఎకరాలు. తినడానికీ, ఇతరులకు పెట్టడానికీ ఏమీలోటులేదు. ఆయనకు పల్లెటూళ్ళోవుండి, ఆ వాతావరణంలో జీవితాన్ని గడపడం పెద్ద ఇష్టమున్నట్లు కనిపించేదిగాదు. అంచేతనే గాబోలు తరుచు పట్నానికిపోయి వస్తూవుండేవాడు. ఆయనబస్తీనించి వస్తే సామాన్యంగా వచ్చేవాడుగాదు. ఏ చిన్నకార్లోనో, అధమం జట్కా చేసుకొనో వచ్చేవాడు.

అసలు కరణంగారి కుటుంబమంతా అంతే! అంతా సంస్కారంగలవాళ్ళే. ఒకరి భావాలకి, ఒకరి ఆదర్శాలకు ఇంకొకరు అడ్డుచెప్పడం వుండదు. ఎవరి ఇష్టంవచ్చినట్లు వారు ఆయా విధాల్ని అనుసరించవచ్చు. ఆయనభార్య సరస్వతమ్మగారు పెద్దగా చదువుకోలేదుగాని, ఇంగ్లీషు రాయగలదు. ఆమెకు స్వజాతిమీద బ్రహ్మాండమైన భావాలున్నాయని అనుకొనేవారు. చక్రపాణిగారు ఆవిడకేమీ అడ్డు చెప్పేవారుగాదు. ఆయన గొడవేమిటో ఆయనతప్ప. ఆవిడ మహిళా సంఘాన్ని ఒకటి లేవదీసింది. దాని కావిడ అధ్యక్షురాలు. అంచేత ఆవిడా తరుచు బస్తీ పోతూవుండేది.

ఇక చక్రపాణికి మగపిల్లలెవ్వరూలేరు-ఇద్దరు ఆడపిల్లలు తప్ప. సరస్వతి ఇద్దరి కూతుళ్ళకూ అన్యాయం జరగడానికి వీల్లేదని ముందుగానే పొలమంతా నాలుగుభాగాలుగా విభజించి ఇద్దరమ్మాయిలకీ రెండుభాగాలు పంచింది.

ఇది నారాయణ వీధిబళ్ళో చదువుతున్నప్పటి మాట. అప్పుడు కరణంగారి వ్యవహారం బాగానే వుండేది. ఊళ్ళో కావలసినంత పలుకుబడి, ఆయన మాటకు తిరుగులేదు. అటువంటి వైభవాన్ని చూచిన కళ్ళతోనే ఈనాడు చక్రపాణిని, ఓ చిన్న కాఫీహోటలు పెట్టుకొని దైన్యస్ఫురకలతో గల్లాదగ్గర కూర్చున్నప్పుడు చూచి నారాయణ మనసు జాలిపడింది; బాధ పడిందికూడా. నిజానికి చక్రపాణి ధనవంతుడైనా, అలా అని గర్వపడేవాడుగాదు. ఆయన వ్యవహారాలేవిటో తప్ప ఇంకోరిజోలికి పోయేమనిషిగాదు. ఓసారి వెంకటుస్వామి అప్పులపాలై ఇల్లు వేలంవేస్తే చక్రపాణిగారు అతగాడికి తన స్థలంలోనే తన చేతి డబ్బుతో ఇల్లు కట్టించి యిచ్చాడు, అంత ఉదారుడు. ఎప్పుడూ ఏవో పుస్తకాలు చదువుకుంటూ కాలం గడిపేవాడు వూళ్ళో వున్నంతసేపూను. ఆనాటి సంస్కారం ఈనాడు చక్రపాణి ముఖంలో ఎక్కడా పోలికగాకూడా కనిపించలేదు.

ప్రొద్దుటినించీ పడదోసుకువస్తున్న నిద్ర ఇప్పుడు రమ్మని ఆహ్వానించినా రావడంలేదు. నారాయణ చక్రపాణిదగ్గరికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. అంతా ఆలోచించగా నారాయణకి చక్రపాణి జీవితపులోతున ఎక్కడో తీవ్రమైన ఆఘాతం తగిలినట్లే అనిపించింది.

భోజనంచేసి చక్రపాణి హోటలుకు వెళ్ళేసరికి అప్పుడే హోటలు తలుపులు వేస్తున్నారు. చక్రపాణి అక్కడే కూర్చుని డబ్బు లెక్కపెట్టుకొంటున్నాడు. నారాయణ వెళ్ళి ప్రక్కనే వున్న బల్లమీద కూర్చున్నాడు. చక్రపాణి నారాయణవంక చూచి "ఆఁ! వచ్చావుటోయ్. మీ ఇంటికి చాలాదూరంగదూ? చాలాదూరం నడిచి వచ్చావే!" అని డబ్బులు లెక్క చూస్తూనే వున్నాడు. ఇంతలో బయట ఎవరిదో గట్టిగా గొంతు వినిపిస్తోంది. అది కేవలం ఈ హోటల్లో వున్నవ్యక్తిని ఉద్దేశించి అంటున్నట్లుగానే వుంది.

"ఇదుగో! నువ్వు బయటికిరా! నే నేమి టేమిటో చేస్తున్నానని అందరితో చెపుతున్నా వటగా? నే నేంచేస్తే నీకెందుకు? నే న్నీకేమీ బానిసను గాదు. స్వతంత్రంగా బ్రతుకుతాను. నాకు రావలసిన డబ్బు నాకు పారెయ్ ఇవతల" అంటూ బయట ఓ ఆడగొంతు పెద్దగా విని పిస్తోంది. చక్రపాణి ఇదివిని నివ్వెరపోయి నారాయణవంక చూచి ఓ క్షణంసేపు, "వింటున్నావు టోయ్?" అన్నాడు. నారాయణకు ఏమాత్రమూ అర్థంకాలేదు "ఆమె ఎవరండీ?"...అన్నాడు. చక్రపాణి బలమైన నిశ్వాసం ఒకటి వదలి "నీకింకా తెలీలే?" అన్నాడు.

నారాయణ శిలాప్రతిమలా వుండిపోయాడు మాట్లాడకుండా, అతని కిదంతా వింతగా వుంది.

"ఆవిడే! నాభార్య" అన్నాడు చక్రపాణి. చక్రపాణి మాట్లాడిన ప్రతిమాటా నారాయణకి వింతగా వుంది.

"చక్రపాణి భార్య—సరస్వతి నడివీధిలో నిలబడి కేకలువేస్తోంది." ఈ విషయం అసలు నారాయణ నమ్మడానికే వీల్లేకుండా వుంది. బయటికి వెళ్ళి చూచాడు. నిజమే! ఆయన చెప్పిం దాంట్లో ఈషన్మాత్రమైనా అబద్ధంలేదు. మునిసిపల్ లైటు కాంతిపడి ఆమె ముఖం కనిపిస్తూనే వుంది. మనిషిలా వెక్కుంది! శరీరం నల్లగా పెంకు కట్టినట్లు వుంది.

ముఖంలో నాజూకు ఏమాత్రమూ లేదు. నారాయణకు ఆనాటి సరస్వతి బెనారెస్ చీరెలూ, జార్జెటు సిల్కులూ తప్ప ఇతరమైనవి కట్టనిదీ, కాలికి జోడువేసి, రిస్టువాచి పెట్టుకొని కార్లో వెళ్ళిన రోజులు గుర్తుకొచ్చాయి. ఆనాటి సరస్వతిలో కొన్ని ముఖ కవళికలు తప్ప నారాయణకు ఈమెలో ఇంకేమీ కనిపించలేదు. ఆనాటి సంస్కారం, సంఘ సంస్కరణ మొదలైనవన్నీ ఆమెలోనుంచి ఎక్కడికి పోయాయో అంతులేదు. ఒకసారి తన పుట్టినరోజు పండక్కి ఆవిడే వచ్చి ఆశీర్వదించింది. అప్పుడు ఆమె మీద ప్రతి యువతి చూపిన గౌరవం అన్నీ గుర్తుకొచ్చి ఆమేనా, ఈమె? అనుకున్నాడు నారాయణ. ఆమె బయటనిలబడి, బయటికి వెళ్ళినసర్వర్‌ని ఉద్దేశిస్తూ "మీరన్నా చెప్పండి. నా వాటాకు రావలసిన డబ్బు నాకు పారవెయ్యమంటే పారెయ్యడు. నాకుమాత్రం కావద్దూ? మీరైనా చెప్పండి పెద్దమనుషులు" అంటోంది.

"ఆమెకేమన్నా మతిచెడిందా?" అన్నాడు నారాయణ చక్రపాణిని.

చక్రపాణి "కాశీలో ఎవరో మందు పెట్టారట. రోజూ ఇదే వరుస" అన్నాడు.

బయట ఆమె ఇంకా వదల్లేదు, గోలచేస్తూనే వుంది. "నా కూతురికి కడుపు. దానికెన్నో కోరికలుంటాయి. దాని అచ్చటా ముచ్చటా ఎవరు తీరుస్తారు?" అంటోంది. నారాయణ అదిరిపడి మళ్ళా ఇంకోసారి చూచాడు ఆమెకు కాస్త దూరంలో ఇంకో అమ్మాయి నిలబడివుంది. సరిగ్గా లైటుస్థంభంక్రింద నిలబడివుండడంవల్ల ముఖం స్పష్టంగాకనిపించడంలేదు. గర్భిణీమాత్రంనిజమే.

"ఆమె మొదటమ్మాయా రెండో అమ్మాయా?" అన్నాడు నారాయణ చక్రపాణిని వుద్దేశించి.

"రెండో అమ్మాయే" క్లుప్తంగా జవాబిచ్చాడు చక్రపాణి ఏదో తల పైకెత్తి ఆలోచిస్తూ.

"ఆమెకూ మతిభ్రమణయేనా?"

"అహా! లేదు."

"మరి"

చక్రపాణి సమాధానం చెప్పలేదు. సర్వరు ఆమెతో చెపుతున్నాడు- "ఎల్లుండిరా! మొత్తం లెక్కచూచి ఇస్తారట" అంటున్నాడు. ఆమె "అలా చెపితే ముందేపోయేదాన్నా? నాకు రావలసిన వాటా నాకిస్తే నేనిక్కడెందుకుంటాను?" అంటోంది వెళ్ళిపోతూ.

చక్రపాణి దీర్ఘంగా నిట్టూర్పువిడిచి "విన్నావుగా నాయనా! ఇదీ వరుస. రోజూ ఈవేళకే ఆవిడ వస్తుంది. వచ్చినప్పుడల్లా ఇంత రభసా చేసి పోతుంది. ఇదివరకు ధనం, మానం. ఈ రెండూ పోయాక గూడా మానవుడు ఎందుకు జీవిస్తాడా అనుకునేవాణ్ణి. కాని ఇప్పుడనుకుంటున్నాను చావలేక అని" అన్నాడు.

నారాయణ ఆ సమయంలో మెదలకుండా వుండలేకపోయాడు.

"మీరలా బాధపడకండి" అన్నాడు. నిజంగా ఈ మాట అనడంలో అర్థంలేదని తరువాత అతనికే స్ఫురించింది.

చక్రపాణి ఒక్కసారి బిగ్గరగా నవ్వాడు. ఆ నవ్వులో తరతరాలనుంచీ వ్యాపితమయిన ఏవేవో బాధలన్నీ గడ్డ కట్టివున్నట్లున్నాయి. "నువ్వు భలేవాడివయ్యా! పచ్చటి సంసారం ఈనాడు చెట్టుకొకరూ, పుట్టకొకరూ అయి కుటుంబం నామరూపాలు లేకుండా నాశనమయి పోతే నేనింకా ఎలా బాధపడకుండావుంటాను?" అన్నాడు. నారాయణ అశక్తుడిలా వుండిపోవడం తప్ప ఏవిధమైన మాటగానీ మాట్లాళ్ళేదు. చక్రపాణి మళ్ళా మొదలుపెట్టాడు "నీకూ తెలుసుగా నే ఎలా బ్రతికానో? కానీ ఈనాడు ఎలా బ్రతుకుతున్నాను? నీచాతి నీచంగా. చావలేక, బ్రతకలేక బ్రతుకుతున్నాను - అవన్నీ ఎందుకులే, తలుచుకుంటే ఇప్పుడతరగదు, ఏమిటో అంతలో నే నిస్పృహా."

నారాయణ అసలు విషయ పరిశోధనకు నాందిగా "మీ పొలమంతా ఏమైనట్లు?" ప్రశ్నించాడు.

"ఏమైనట్లేమిటి? నేసంపాదించాను గనుకనా, వుండడానికి? ఎలా వచ్చిందో అలా నేపోయింది. కాని నారాయణా! మనుషులకి అపారమైన స్వాతంత్ర్యం ఇస్తే ఫలితం ఎలావుంటుందంటే— ఇదుగో నా జీవితంలాగేవుంటుంది. నేను ఏనాడూ కన్నబిడ్డల్ని గాని, చివరికి చేసుకున్న భార్యను గాని ఏవిధమైన కట్టుబాట్లలోనూ వుంచలేదు. కావలసినంత స్వాతంత్ర్యం ఇచ్చాను. ఈనాడు నా జీవితం ఇలా అయిపోవడానికి ముఖ్యమైన కారణంగూడా అదే. మానవుణ్ణి స్వేచ్ఛ ఎంతగా పతనంచేస్తుందో ఈనాడు నాకర్థమయింది. నేను ఈవిషయాన్ని తెలుసుకొనేసరికే కావలసిందంతా అయిపోయింది.

ఆడపిల్లలకి అన్యాయం జరగకూడదని సరస్వతి ఇద్దరికీ రెండు వాటాలు రాసిచ్చింది. పెద్దమ్మాయి సుమిత్రను బి. ఏ., చదివిన అబ్బాయి కిచ్చేశాను. నే చెయ్యడమేమిటి ఆమే చేసుకుంది. సుమిత్ర చిన్నతనంనుంచీ షోకుల్లో పెరిగింది. సినిమాలంటే సరదా. పెళ్ళయాక సినిమాకు మించిన ప్రపంచమే లేదు. సినిమాల్లో జేరతానంది భర్త కిష్టం లేదు. అతన్నెదిరించి మద్రాసు చేరి రెండు మూడు సినిమాల్లో వేషాలువేసివచ్చింది. తరువాత అందరూ వద్దన్నా పొలమంతా అమ్మేసి ఎవరో పెద్దవేషం ఇస్తానన్నారనీ, డబ్బు పెట్టుబడి పెట్టాలనీ చెప్పి డబ్బంతా తీసికెళ్ళింది. అతగాడెవరో డబ్బంతా కాజేసి తరువాత పట్టిచెయ్యి చూపించాడు. అటు సినిమాల్లోకి ఎవరూ తీసుకోలేదు. ఇటు భర్త తన ముఖం చూడడు-అప్పటితో ఆమెకి పిచ్చెక్కింది. ఇక ఎప్పుడూ సినిమా మాటలే మాట్లాడేది. ఆమె భర్త, భార్య అలా విచ్చలవిడిగా తిరగడం సహించలేక కోపంతో మా కుటుంబానికంతకూ చేతబడి చేయించాడని అంటారు. నిజమేనేమో!

ఇదంతా చూస్తున్న రెండో అమ్మాయి జానకి భర్త అమితప్రేమగా నటించి ఆమె పొలాన్నంతా తనపేర వ్రాయించుకున్నాడు. నిజానికి జానకి చాలా మంచిది. తరువాత సుమిత్ర సినిమాల్లో తిరగడం, సరస్వతి బస్తీలో మీటింగులు చెప్పడం చూచి జానకిని వదిలివేశాడు.

సరస్వతి రాజకీయాల్లోగూడా చెయ్యిపెట్టింది. డబ్బు మంచినీళ్ళలా వాడేసింది. తరువాత భక్తి మార్గంలో దిగి రామకృష్ణ మఠంలో జేరింది. కాశీలో ఎవరో మందు పెట్టారట! ఇలా వైంది. మిగిలిన యెకరం భూమిలో వచ్చే ఆదాయం తీసుకొని వాళ్ళన్నయ్య రోజూ ఇంత ముద్ద వేస్తూ వుంటాడు. తిని బజార్లవెంట తిరుగుతూ వుంటుందిలాగే! ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు?

చివరికి నాకున్నదంతా మిగిలినా బాగానే వుండేది. కానీ మా పెద్దనాన్న కొడుకులు నా పొలంమీద దావా తెచ్చారు. చివరికి గెలిచాను అనుకో. కాని మిగిలింది రెండు రాళ్ళు.

జానకి మాత్రం ఏం చెయగలుగును? దానికీ చీమూ, నెత్తురూ వున్నాయిగా ఏ తప్పూ లేని ఆమెను వదిలేసినందుకు ఆమె భర్తను ఏమైనా దండించగలదా? అతనిమీద దావా తెద్దామంటే డబ్బులేదు. జానకిని తెచ్చి నా ఇంట్లో పెట్టుకోగలను. కాని ఎవరు హర్షిస్తారు? సుమిత్ర సినిమాల్లో తిరిగినప్పుడు డబ్బుందిగనక నన్నెవరూ అనడానికి సాహసించలేదు. కానీ ఈనాడు జానకిని చేరదీస్తే ఈ సమాజంలో స్థానం వుంటుందా? ఇన్ని బాధపడకుండా ఎలా వుండగలను చెప్పు" అని ప్రశ్నించాడు చక్రపాణి. నారాయణ సమాధానం చెప్పేస్థితిలో లేదు. ★